సుబ్బు మేడ దిగాడు. తన గదిలోకి వెళ్లి ఒక తుపాకి తెచ్చేడు. "రానీ. వెధవలిద్దర్నీ షూట్ చేసేస్తాను" అన్నాడు.

"ఎవరైనా షూట్ చేయవలసింది పాఠకుల్ని కాదు. ఆవేశపడకు." అని సుబ్బు చేతిలో తుపాకీ లాక్కుని సీతకి అప్పగించేను. "పిల్లలు జాగర్త" అని చెప్పి ఇంటికి బయలుదేరాను. "కట్టు కథకీ పెట్టుబడికీ పుట్టిన విషపుత్రికలు" అని వారపత్రికలకు నిర్వచనం చెప్పిన మహాకవిని మరోమాటు స్మరించుకున్నాను. ★

# 32. ఇంతకీ, "తమరు" ఏలింగం?

**మా** అబ్బాయి పెళ్లి తరువాత ఏర్పాటు చేసిన రిసెప్షన్ హడావిడిలో నా సూట్‌కేస్ తాళాలు ఎందుకో అవసరం వచ్చాయి. అవి మా రెండో అబ్బాయి 'చిట్టి'కి ఇచ్చినట్టు జ్ఞాపకం. అందుకని వాడికోసం షామియానా అంతటా వెతికేస్తున్నాను. ద్రోణుడి దగ్గిర అస్త్ర విద్య నేర్చుకుంటున్న అర్జునుడికి ఏకాగ్రత పాఠంనాడు చెట్టు చిటారు కొమ్మనున్న ఒకే ఒక ఎర్రటికాయ తప్ప మరేం కనబడనట్టు నా కంటికి ఆ షామియానా అంతటా నించునీ, కూచునీ ఉన్న అశేష జనంలో వి.ఐ.పి. ల దగ్గర్నుంచీ ఎవరూ ఆనడం లేదు. నేనెవరి కోసమో తెగ వెతికేస్తున్నట్టు కనిపెట్టిన మా తమ్ముడి బావమరిది నన్నో క్షణం అటకాయించి "ఎవరికోసం బావగారూ వెతుకుతున్నారు?" అని రొకాయించాడు. నేను నిస్సహాయంగా అతని కళ్లలోకి కూడా చూడకుండా (శూన్యంలోకి చూస్తూ అనాలి గావును!) "మా చిట్టి ఎక్కడా కనబడ్డం లేదండీ" అన్నాను. "ఇదిగో ఇక్కడే ఉంది;" అని మా మరదల్ని చూపించేడు. మా మరదల్ని వాళ్లింట్లో అందరూ "చిట్టీ" అనేవారని గుర్తొచ్చి నాకు నవ్వొచ్చింది.

ఇంకోసారి మా బావమరిది గారింటికి కాకినాడ వెళ్తూ, తోవంతా వాళ్ల బావమరిది 'చిన్ని' గురించి ఆలోచిస్తూ ఉన్నానేమో; కుశల ప్రశ్నలు అయ్యాక "పాపం, చిన్నికి ఈ మధ్య ఏక్సిడెంట్ అయిందటగా, ఇప్పుడెలా వుంది?" అన్నాను. మా బావమరిదికి వెంటనే వాళ్ల బావమరిది గుర్తు రాలేదనుకుంటాను. నవ్వేడు. "నువ్వు మంచి తమాషాగా మాట్లాడతావే!" అని నన్ను మెచ్చుకున్నాడు. లోపలికి తిరిగి "చిన్నీ, ఇలా రా; మామయ్య పిలుస్తున్నాడు" అన్నాడు.ఇంట్లోంచి పదమూడేళ్ల పిల్ల సిగ్గు పడుతూ ఒచ్చి వాళ్ల నాన్న వెనుక నుంచుంది. "మామయ్యకి దండం పెట్టుకో, నీ కట్నం నీకు ముట్టచెప్తాడు" అన్నాడు. నాకు అప్పుడు గాని అర్థం కాలేదు మా బావమరిది కూతురు 'చిన్ని' వారం రోజుల క్రితం 'పెద్దమనిషి' అయిందనీ, ఆ సందర్భంగా ఆ పిల్లకి నేనొక లంగా, వోణీ, జాకెట్టు (లేదా వాటికి సరిపడే డబ్బు) బాకీ వున్నానని. ఆ విధంగా నూరు రూపాయల తక్షణ జరిమానా చెల్లించుకున్నాను.

ఆ మధ్య నేనొక పత్రికకి సాంస్కృతిక విలేఖరిగా పనిచేస్తూ ఉండిన రోజుల్లో మాకు ఆఫీసర్‌గా ఉండే రామయ్య గారు ట్రాన్స్ఫరై కైలాసరావు గారనే ఆయన వొచ్చారు. సాంస్కృతిక సమాజాలతో నాకు ఏర్పడిన పరిచయం కర్ణాకర్ణిగా విని ఆ రంగంలో నాకు కొంత పలుకుబడి

ఉందనుకున్నాడు గాబోలు; ఓసారి నేను వాళ్లింటికి వెళ్లినపుడు ఆఫీసు ర్యాంకులకి అతీతంగా నాకు మర్యాదచేసి "మారత్నంకి ఇప్పుడిప్పుడే డాన్స్‌లో మంచి నేర్పు వస్తోంది. ఒక అరంగేట్రం కార్యక్రమం పెట్టించాలని అనుకుంటున్నాను. ఈ విషయంలో నీ సలహా సహాయం కావాలి" అన్నాడు. "దానికేం వుంది? రేపు ఇరవయ్యారో తారీకు నాడు ఈ వూళ్లో లయన్స్ క్లబ్ (నార్త్ వెస్ట్) వాళ్లు వారి క్లబ్ ఆనివర్సరీ చేసుకుంటున్నారు. ఆ సందర్భంగా అమ్మాయి డాన్స్ ప్రోగ్రాం పెట్టించమని వాళ్లకి చెబుతాను" అన్నాను. "అమ్మాయి కాదయ్యా బాబూ! మా రెండో అబ్బాయి వెంకటరత్నం గురించి, నేను చెబుతూంట!" అని ఆయన నామీద చిరాకు పడబోతూ ఉండగానే "నమస్తే అంకుల్!" అంటూ ఒక పధ్నాలుగేళ్ల అబ్బాయి ఫేడిన్‌లోకి వచ్చాడు, ఒక గొప్ప నాట్యభంగిమలో.

దాదాపు ముప్పయ్యయిదేళ్ల కిందట నేను మంచి ఊపులో ఘంటసాలవి, మహమ్మద్ రఫీవి సినిమా పాటలు పాడేస్తూ ఉన్న రోజుల్లో (విజయనగరంలో) తెన్నేటి వారి దేవిడీలో ఒక సిటింగ్ పెట్టేరు. ఒక డ్యూఎట్ పాడమని ఎవరో అడిగారు. ఆడా మగా రెండు గొంతుకలూ నేనే మేనేజ్ చేసి పాడెయ్యడానికి సిద్ధం అయిపోయినా, ఆ ఇంటి పెద్ద (పేరు గుర్తులేదు, ఎడ్వకేటు) "ఆగు. ఈ పాట నువ్వూ మా గోపాలం కలిసి పాడుతే బావుంటుంది" అన్నారు. నేనే గోపాలం కదా, నాకు తోడు ఇంకో గోపాలమా-అని నేను సంకోచంలో పడ్డాను. ఇంతలోకే ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి ఆ సిటింగులో కొచ్చి "ఏం నాన్నా పిలిచేవట?" అంది. "అదేనే; మల్లీశ్వరిలో మేఘమాల పాట నువ్వూ ఇతనూ పాడితే బావుంటుందని" అన్నాడాయన. (ఆ అమ్మాయి పేరు గోపాలరత్నం, ఇంట్లో గోపాలం అని పిలుస్తారట!)

కిందటి నెల నాలుగో తారీఖుని నాకు ఒక టెలిగ్రాం వచ్చింది. 'ఎరైవింగ్-మన్‌డే-గొడావరి-రిసీవ్-స్టేషన్-బుజ్జి" (సోమవారం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి మీ వూరు వస్తున్నాను.స్టేషన్‌లో కలుసుకోవలెను: బుజ్జి) అంతకు ముందు కొన్ని రోజులుగా మా తమ్ముడు తనకి విశాఖపట్నం నుంచి కావలసిన కొన్ని వస్తువుల సంగతి రాస్తూ; నువ్వు ఎవరిచేతనైనా పంపించు; లేదా ఆ వస్తువుల కోసం నేనే ఎవరినైనా పంపిస్తాను" అని ఉత్తరాల్లో రాస్తూ వొచ్చాడు. సరే బుజ్జి (తమ్ముడు కొడుకు) వస్తున్నాడులే అనుకొని ఆ సరుకులన్నీ సిద్ధం చేసుకుని; ఏడోతేదీ గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి వెళ్లాను. నేను ఫ్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డ చోట ఒక ఫస్టు క్లాసు పెట్టె ఆగింది. సరే మనవాడు సెకండ్ క్లాసులో కదా వస్తాడని తొందరగా ఉత్తర దిశకి సరకాయించుకుంటూ వుంటే వెనకనుంచి ఓ దబాయింపు! "ఒరే, తమ్ముడూ! ఏంరా అలా పారిపోతున్నావు? టెలిగ్రాం ఇచ్చేను; స్టేషన్‌కి వచ్చేవు. కిటికీలోంచి నన్ను చూసీ కూడా అలా వెళ్లిపోతున్నావేంటి?" ఆవిడ మా దొడ్డమ్మ కూతురు; అరవై ఏళ్ల "బుజ్జి" (అసలావిడ ఉందని గాని; హైదరాబాద్‌లో ఉందని గాని, ఆవిడ విశాఖపట్నం వస్తే స్టేషన్లో నేను "రిసీవు" చేసుకొని ఇంటికి తీసుకెళ్లే దుర్గతి పడుతుందని గాని నేను ఊహించనే లేదు! అలాంటపుడు ఈ అరవై ఏళ్ల ఆవిడ తనని తాను బుజ్జీ అని పిల్చుకొంటోందని; మమ్మల్ని కూడా అలా తనని పిలవమంటోందనీ; ఎలా ఊహించడం?)

నా దురదృష్టం ఏమిటోగాని, ఇలాంటి ద్విలింగ నామధేయాలూ, సంక్షిప్త నామాలూ, ముద్దు పేర్లూ తటస్థపడ్డప్పుడల్లా నేను ఆడకి మగా, మగకి ఆడా (తప్పుగా) ఊహించి పప్పులో

కాలెయ్యడమే గాని సరైన గెస్సు చేయనే లేకపోతున్నాను. దాంతో నామాశ్రయమైన హాస్యం నామమాత్రంగానైనా ఉద్భవించి నేనొక హాస్యాస్పదమైన వ్యక్తిగా తయారైపోయాను.

"కనకం గురించి చెప్పాలంటే చాలా ఉంది. అసలే పొడగరి, గుండ్రని మొహం. నడక ఠీవిగా ఉంటుంది. ఉంగరాల జుట్టు" అని మొదలైన ఒక కథ తగిలింది, ఓసారి నాకు. కనకం అందాలు ఇంకా ఏంటేంటి ఎక్స్‌ప్లోర్ చేస్తున్నాడో రచయిత - అనుకుంటూ కథ కోసం కాకపోయినా కనకం కోసం చదువుకుంటూ పోతే హటాత్తుగా "రిక్షా కోసం చూస్తున్న కనకానికి ఆపద్బాంధవుడిలా పదమూడో నెంబరు బస్సు ఖాళీగా కనబడ్డంతో" అన్న దగ్గిర ఆ పెసరపప్పు పొట్లాం కాగితం మీద ఇంకో ఇంగ్లీషు పేపరు ముక్క అతుక్కొని కథ ఆగిపోయింది. పట్టుపట్టి పెసరపప్పు సంచీని నీట్లో నానబెట్టి హిందూ పేపరు ముక్కని ఊడతీసి చూస్తే కింద లైనులో "అందులో ఎక్కేశాడు!" అని ఉంది.

వీధిలో నిలబడి "శేషూ!" అని కేకవేస్తే మా ఇంట్లోంచి మా అబ్బాయి శేషగిరి రాలేదు. సరికదా; ఎదురింట్లోంచి ఓ అమ్మాయి (శేషారత్నం) పరిగెట్టుకుంటూ వొచ్చి "ఏంటి అంకుల్?" అంది ఒకసారి.

రాజశ్రీ అని నా చిన్ననాటి మిత్రుడు (ఇందుకూరి రామకృష్ణంరాజు) మద్రాసులో సినీ రచయితగా ఉన్నాడు. అతని కోసం టెలిఫోన్ చేస్తే నటీమణి రాజశ్రీ తగిలింది మరోసారి.

ఓ ధర్మ సందేహంతో రేడియో స్టేషనుకెళ్లి "ఉషశ్రీ గారెక్కడుంటారు?" అని అడిగితే అక్కడ ఎటెండరు ఒక గది చూపించి "వారేనండి ఉషశ్రీ గారు" అన్నాడు. కుర్చీలోంచి లేచి "రండి రండి, మా మహిళా కార్యక్రమాల కోసం చిన్న హాస్య నాటిక రాసివ్వాలి మీరు" అంటూ నన్ను మొహమాట పెట్టేశారు అక్కడున్నావిడ.

ఇవన్నీ గుర్తొచ్చి నా మీద నేను చిరాకు పడుతూ ఉంటే ఫోన్ రింగు అయింది. "హలో" అన్నాను. "మామయ్యా, నేను సుబ్బుల్ని మాట్లాడుతున్నాను" అంది అవతలి గొంతు. అదేమిటి సుబ్బులూ, నీ గొంతుకేమిటి అలా వుంది?" అన్నాను. నేను మావయ్యా శ్రీపాద నారాయణ గారబ్బాయి సుబ్బుల్ని. మీ మేనకోడలు సుబ్బులక్ష్మిని కాదు". నేను షాక్‌లోంచి తేరుకోకముందే వాడు నూరు రూపాయలు అప్పు అడగడం; "సరే ఇస్తాను; రా!" అని గోతిలో పడ్డం అయింది.

మా మనవడికి తెలుగు గ్రామరు బోధపరుస్తూ "డు, ము, వు, లు ప్రథమా విభక్తి" అని చెప్పేను. "డు" అనేది పుంలింగ మహద్వాచక ప్రత్యయం అని చెప్పి, రాముడు, కృష్ణుడు, రావణుడు ఎగ్జాంపుల్స్ చెప్పాను.

"అయితే "డు" ప్రత్యయం చివర్ని ఒస్తే పుంలింగమా, తాతయ్యా?" అన్నాడు.

"ఖచ్చితంగా"

"అమ్మడు - ఏ లింగం?" అని అడిగేడు వాడు.

మా అన్నయ్య కూతురు అమ్మడు అని ఒకతె ఉంది. దాని మొగుడి పేరు శరభలింగం.

ఐనా నేను మా మనవడికి అవేం చెప్పలేదు. "వెధవ ప్రశ్నలు వెయ్యకు" అని వాణ్ణి కసిరీసేను. ★